# లోక్ సభ ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

- జోగులాంబ గద్వాల కలెక్టర్ సంతోష్
- నాగర్‌కర్నూల్ ఎంపీ ఎన్నికల నిర్వహణపై మీడియా సమావేశం

గద్వాల, మార్చి 20 : జిల్లాలో లోక్ సభ ఎన్నికలు సజావుగా నిర్వహిచేందుకు తమ వంతు సహకారం అందించాలని కలెక్టర్ సంతోష్ ప్రజలు, పాత్రికేయులను కోరారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో నాగర్‌కర్నూల్ సాధారణ లోక్ సభ ఎన్నికల నిర్వహణపై పాత్రికేయులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు షెడ్యూలు విడుదలైందని, ఏప్రిల్ 18న నోటిఫికేషన్ వస్తుందని, ఏప్రిల్ 25 వరకు నామినేషన్ల స్వీకరణ, 26న స్క్రూట్నీ, 29 వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉంటుందని తెలిపారు. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ జరుగుతుందని తెలిపారు. ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో 2,43,353 మంది పురుషులు, 2,51,573 మంది మహిళలు , 19 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారని జిల్లాలో మొత్తం ఓటర్లు 4,94,945 మంది ఉన్నారని తెలిపారు. 85 ఏండ్లు పైబడిన వారికి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు హోం ఓటింగ్ సదుపాయం కల్పించినట్లు తెలియజేశారు. సరిహద్దు ప్రాంతాల్లో అక్రమాలు జరుగకుండా నివారించేందుకు గద్వాల నియోజకవర్గంలో 3, అలంపూర్ నియోజకవర్గంలో మూడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో మద్యం, డబ్బు అక్రమ రవాణా చేయకుండా అరికట్టేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు పాల్పడే వారిపై సీ-విజిల్ ద్వారా ఫిర్యాదులు స్వీకరిస్తామని, వచ్చిన ఫిర్యాదులను వంద నిమిషాల్లో పరిష్కరిస్తామని తెలిపారు. ఇప్పటి వరకు ఐదు ఫిర్యాదులు స్వీకరించినట్లు కలెక్టర్ చెప్పారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్ కాస్టింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఈవీఎంలు, వీవీప్యాట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎన్నికల్లో భాగంగా ర్యాలీలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు రాజకీయపార్టీలు సువిధ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే రెండు రోజుల్లో అనుమతి మంజూరు చేస్తామన్నారు. ఎన్నికల సిబ్బందిని ర్యాండమైజేషన్ కేటాయించడం జరుగుతుందన్నారు. ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ప్రక్రియ, కౌంటింగ్ నాగర్‌కర్నూల్‌లో నిర్వహిస్తారని చెప్పారు. జిల్లాలో ఇప్పటి వరకు 18ఏండ్లు నిండిన యువత ఓటరుగా నమోదయ్యే విధంగా మీడియా ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఇది నిరంతర ప్రక్రియని ఫారం-6 ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. అలంపూర్ నియోజకవర్గంలోని సింగవరంలో పోలింగ్ బూత్ ఏర్పాటు కోసం ఎన్నికల కమిషన్‌కు అనుమతి కోరినట్లు తెలిపారు. జిల్లాలో మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నందున వారి కోసం గద్వాల నియోజకవర్గంలో 5, అలంపూర్ నియోజకవర్గంలో ఐదు మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అధికారులు నరేశ్, మహ్మద్ హరీఫ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జోగులాంబ గద్వాల కలెక్టర్ సంతోష్

## నూతన ఆవిష్కరణలతోనే మానవ జీవన గమనం

- మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి


విజ్ఞాన మేళా ఆవిష్కరణలను తిలకిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

ఆత్మకూరు, మార్చి 20 : నూతన ఆవిష్కరణలతోనే మానవ జీవన గమనమని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎం.వీ. రామన్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన సైన్స్ విజ్ఞాన మేళా కార్యక్రమానికి ఆయన తిలకించారు. విద్యార్థులు సబ్జెక్టుల వారీగా ఆవిష్కరించిన ఎన్నో నూతన ఆవిష్కరణలను ఆయన వీక్షించి విద్యార్థులను అభినందించారు. సైన్స్‌తోనే మానవ విజ్ఞానం, ప్రగతి అని చెప్పుకొచ్చారు. అంతకుముందు ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ కోఆర్డినేటర్ బింగి నరేంద్ర నేతృత్వంలో ప్రతినిధుల బృందం మేళాను తిలకించి విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందించారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు వండర్ బుక్‌లో 450ప్రయోగాలతో కల్గిన రికార్డును ఎం.వీ. రామన్ పాఠశాల విద్యార్థులు అధిగమించారన్నారు. మొత్తంగా 619 ప్రయోగాలతో సరికొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పినట్లు నరేంద్ర తెలిపారు. ఈ అద్భుత ఆవిష్కరణల వండర్ బుక్ ఆఫ్ రికార్డు ప్రశంసాపత్రాన్ని పాఠశాల చైర్మన్ మొగిళి శ్రీధర్‌గౌడ్, ప్రిన్సిపాల్ ఆస్నీ శ్రీధర్‌కు అందజేశారు. వండర్ రికార్డ్ దక్కడంపై మాజీ ఎమ్మెల్యే చిట్టెం శ్రీధర్‌గౌడ్‌ను అభినందించారు. అనంతరం ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రీయాదవ్, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కోటేశ్వర్, పీఏసీసీఎస్ అధ్యక్షుడు గాడి కృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, నాయకులు రవికుమార్‌యాదవ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

## కేంద్రాల్లోనే ఆకుకూరలు పండించాలి

- జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి సుధారాణి


పెద్దపల్లిలో గర్భిణులకు పసుపు, కుంకుమ, జాకెట్‌ను పంపిణీ చేస్తున్న జిల్లా అధికారిణి

మల్దకల్, మార్చి 20 : అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాల్లో ఆకుకూరలను పెంచి చిన్నారులు, గర్భిణులకు వండి పెట్టాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి సుధారాణి సూచించారు. మండలంలోని పెద్దపల్లి గ్రామ అంగన్‌వాడీ సెంటర్‌లో పోషణ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా మల్దకల్ సెక్టార్ అంగన్‌వాడీల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా సంక్షేమాధికారిణి సుధారాణి, సీడీపీవో కమలాదేవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధికారిణి సుధారాణి మాట్లాడుతూ మార్చి 9వ నుంచి 23తేదీ వరకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 15 రోజుల పాటు పోషణ పక్షం కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు, కిశోర బాలికలు కావాల్సిన పోషకాహారం వాటి విలువలు గురించి వివరించారు. అలాగే చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం తోపాటు గర్భిణులకు సీమంతాలు, చేసి ఆశీర్వదించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగరాణి, మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన అంగన్ వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే నెల 4న చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

అమరచింత, మార్చి 20 : అమరచింత మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మపై అవిశ్వాసానికి సంబంధించి కలెక్టర్ తేజస్‌నందన్‌లాల్‌పవార్ నుంచి కౌన్సిలర్లకు నోటీసులు అందాయని కౌన్సిలర్లు రాజశేఖర్‌రెడ్డి, సింధూ, మాధవి, విజయరాములు, ఉషారాణి, లావణ్య తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.18కోట్ల నిధులు రాగా చైర్‌పర్సన్, కమిషనర్ మహ్మద్ ఖాజా, అకౌంటెంట్ ఇందిర కుమ్మక్కై పనులు చేయకుండానే బిల్లులు డ్రా చేసుకొని రూ.9కోట్ల వరకు అవినీతికి పాల్పడ్డారు. దీంతో చైర్‌పర్సన్ మంగమ్మపై అవిశ్వాసం పెట్టాలని ఈనెల 18 తేదీన కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినట్లుగా కౌన్సిలర్లు తెలిపారు. కాగా కలెక్టరేట్ నుంచి వచ్చిన అధికారులు ఏప్రిల్ 4వ తేదీన చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెడుతున్నట్లుగా తమ వద్ద సంతకాలు తీసుకున్నారని వారు తెలిపారు. ఆరుగురు కౌన్సిలర్లలో ఇద్దరు రాజశేఖర్‌రెడ్డి, సింధూ బీఆర్‌ఎస్ కాగా, లావణ్య, ఉషారాణి బీజేపీ కౌన్సిలర్లు, విజయరాములు సీపీఐ, మాధవి సీపీఎం వారు ఉన్నారు.

## వేధింపుల కేసులో వ్యక్తికి నాలుగు నెలల జైలు

అమరచింత, మార్చి 20: మండలంలోని ఒక గ్రామానికి చెందిన మహిళను వేధించిన కేసులో మహేశ్ అనే వ్యక్తికి నాలుగు నెలల జైలుశిక్షతో పాటు రూ.1,000 జరిమానా విధించినట్లుగా ఎస్సై సురేశ్ తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ 2019 ఏడాదిలో మండలంలోని కొంకనోనిపల్లి గ్రామానికి చెందిన మహేశ్ తనను వేధించినట్లు ఓ మహిళ ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ చేసి కేసు నమోదు చేశారు. బుధవారం ఆత్మకూర్ మున్సిఫ్ కోర్డులో హాజరుపర్చగా జడ్జి శిరీష నిందితుడికి నాలుగు నెలల జైలుశిక్షతో పాటు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని ఎస్సై తెలిపారు.

## బైక్‌ను తప్పించబోయి ఆటోబోల్తా

కొత్తకోట, మార్చి 20 : ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి ఆటో అదుపు తప్పి బోల్తా పడిన ఘటన కొత్తకోట పట్టణ సమీపంలో మదర్ థెరిస్సా జంక్షన్ వద్ద బుధవారం చోటుచేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం జోగుళాంబ జిల్లా రాజోళి మండలం గార్లపాడుకు చెందిన ఐదుగురు ఆటోలో ప్రయాణిస్తున్నారు. ఆటో బోల్తా పడగా రాజు, నాగన్న, కృష్ణకు గాయాలయ్యాయి. బైక్‌పై ఉన్న ఇద్దరికి స్వల్పంగా గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108లో జిల్లా దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

## ఏడు లీటర్ల సారా పట్టివేత

గోపాల్‌పేట, మార్చి 20 : అక్రమంగా సారా విక్రయిస్తున్న మహిళ నుంచి సారాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై హరిప్రసాద్ కథనం మేరకు మండలంలోని ఏదుల గ్రామానికి చెందిన బయమ్మ గ్రామంలో అక్రమంగా సారా విక్రయిస్తుండగా, సమాచారం అందజేయడంతో బుధవారం పోలీసులు ఆమె ఇంటి వద్దకు వెళ్లి, ఇంట్లో నిల్వ ఉంచిన 7లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం


స్వయం పాలనలో పాల్గొన్న విద్యార్థినులు

రాజోలి, మార్చి 20: రాజోలి ప్రాథమిక పాఠశాల విద్యార్థుల బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని జరుపుకొన్నారు. హెచ్‌ఎంగా జయశ్రీ, కాంప్లెక్స్ హెచ్‌ఎంగా సౌజన్య, ఎంఈవోగా గాయత్రీ, డీఈవోగా వైష్ణవి వ్యవహరించారు. ప్రతి విద్యార్థి సమయాన్ని వృథా చేసుకోరాదని, ఒక లక్ష్యంతో చదవాలని ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నియమావళిని సమర్థవంతంగా అమలు చేయాలి

- ప్రలోభాల నివారణపై నిఘాపెట్టాలి
- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి, మార్చి 20 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల నియమావళిని సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పేర్కొన్నారు. ఎన్నికల్లో ప్రలోభాలను నిరోధించి పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు పకడ్బందీగా నిఘా పెట్టాలని అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో పోలీస్, వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, ఆదాయ పన్నులు, ఇంటెలిజెన్స్, బ్యాంకు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో ప్రలోభాలను అరికట్టేందుకు ఒక్కోశాఖ చేయాల్సిన పనులు, వివిధ శాఖల మధ్య సమన్వయంపై కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఓటర్లను ప్రలోభపెట్టే ప్రయత్నాలను ఎప్పటికప్పుడు పసికట్టి అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రలోభాలకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేయాలని, జిల్లాలో చేపడుతున్న నిఘా వివరాలపై శాఖల వారీగా కలెక్టర్ సమీక్షించారు. మద్యం, నగదు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా జరుగకుండా పటిష్ట నిఘా ఉంచాలన్నారు. బెల్టు షాపులు, సారా దుకాణాలపై నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలని, సరిహద్దు ప్రాంతాల్లోని చెక్ పోస్టుల్లో నిఘా కెమెరాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. తప్పుడు సమాచారం, ఫేక్ న్యూస్‌లను అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బ్యాంకు నుంచి జరిగే లావాదేవీలను గమనిస్తూ ఉండాలని, పది లక్షలకు పైగా ట్రాన్సాక్షన్ జరిగిన వాటిపై నిఘా ఉంచాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, ఎం నగేశ్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఆర్డీవో పద్మావతి, డీటీవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

## ఉపాధి హామీ పనుల పరిశీలన

పెద్దమందడి, మార్చి 20 : మండలంలోని వీరాయపల్లి గ్రామంలో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను బుధవారం ఎంపీడీవో సద్గుణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూలీల సంఖ్య పెంచాలని, ఎండలు తీవ్రంగా ఉండడంతో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మొక్కలు ఎండిపోకుండా ఉదయం, సాయంత్రం వేళలో నీరు పట్టాలన్నారు. హరిత హారంలో నాటిన మొక్కలకు నీరు పట్టాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని, పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు నిర్వహించాలన్నారు. ఉపాధిహామీ పనుల్లో భాగంగా చెరువులు, కాల్వల్లో జరుగుతున్న పనులను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్, కూలీలు ఉన్నారు.

## పిల్లలపై జాగ్రత్తలు తీసుకోవాలి

వీపనగండ్ల, మార్చి20 : వేసవి కాలంలో పిల్లలపై తల్లిదండ్రులు నిరంతరం జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై నందికర్ అన్నారు. మండల కేంద్రంలోని డఫోడిల్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నూతన విద్యా సంవత్సరం క్యాలెండర్‌ను బుధవారం ఎస్సై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చి15 నుంచి ఒంటి పూట స్కూల్ ఉన్నందున విద్యార్థులు మధ్యాహ్నం నుంచి బావులు, చెరువులు, కాల్వలకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వేసవి సెలవులను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు ఆటలు, పాటలు, డాన్స్ వంటి సాంస్కృతిక కార్యక్రమాలను అలవాటు చేసేవిధంగా తల్లిదండ్రులు కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## భజన బృందాలకు బహుమతులు

వడ్డేపల్లి, మార్చి 20: జూలేకల్ జాతర సందర్భంగా నిర్వహించిన భజన పోటీల్లో ప్రథమ బహుమతి రూ.20, 116 పర్ధీపురం మారుతి భజన మండలి, రెండో బహుమతి పర్ధీపురం మల్లికార్జున భజన బృందం రూ.15, 016 గెలుచుకున్నారు. మూడు, నాలుగు తుమ్మిల్ల, నక్కలపల్లి, ఐదో బహుమతి ధర్మారం, ఆరు, ఏడు కొంకల, శనగపల్లె, ఎనిమిది ఈడిగోనిపల్లె, తొమ్మిదో బహమతి గురుదొడ్డి బృందం గెలుపొందారు. దాతల సహకారంతో వారికి ప్రకటించిన బహుమతులను నిర్వాహకులు అందజేశారు.

## తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

- వనపర్తి జెడ్పీ సీఈవో యాదయ్య

పాన్‌గల్,మార్చి20:గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని జెడ్పీసీఈవో యాదయ్య అన్నారు. బుధవారం మండలంలోని అన్నారంలో జరుగుతున్న ఈజీఎస్ పనులను ఆయన పరిశీలించారు. ఉపాధిహామీ పనుల విషయంపై కూలీలతో మాట్లాడారు. అదేవిధంగా వన నర్సరీని సందర్శించి మొక్కల పెంపకాన్ని పరిశీలించారు. అన్నిరకాల మొక్కలు పెంచాలని, సకాలంలో నీరందించాలని సూచించారు. అనంతరం మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించాలన్నారు. ఎన్నికల కోడ్ నిబంధనలు పాటించే చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో కోటేశ్వర్, ఎంపీవో రఘురాములు, ఏపీవో కురుమయ్య పాల్గొన్నారు.


అన్నారంలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో యాదయ్య

## చిన్నారులకు అన్నప్రాసన


అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న దృశ్యం

వడ్డేపల్లి, మార్చి 20: వడ్డేపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పోషణ పక్షం సందర్భంగా గర్భిణులు, బాలింతలు, ప్రీస్కూల్ పిల్లల తల్లులకు పోషక విలువలున్న ఆహారం గురించి సూపర్‌వైజర్ వెంకటేశ్వరి అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు శిరీష, సోమేశ్వరి, కీర్తి, నాగమణి, లక్ష్మీదేవి, శ్రీదేవి, సునీత, జయలక్ష్మి, ఆయాలు పాల్గొన్నారు.

## ఉదయం వేళల్లోనే పనులకెళ్లాలి

అయిజ రూరల్, మార్చి 20: గ్రామీణ ఉపాధిహామీ పనులకు కూలీలు ఉదయం వేళలోనే వెళ్లాలని టెక్నికల్ అసిస్టెంట్ అశోక్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని సంకాపురంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలకు పలు సలహాలు, సూచనలు చేశారు. ప్రధానంగా ఎండలు అధికంగా ఉండడంతో ఉపాధి పనులకు ఉదయం వేళలోనే వెళ్లి మధ్యాహ్ననికంతా ఇండ్లకు చేరాలని సూచించారు. పనులు జరిగే ప్రదేశం వద్దకు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచామని తెలిపారు. ఆయన వెంట ఫీల్డ్‌అసిస్టెంట్ ఉత్తనూరయ్య, సీనియర్ మేటీ నాగరాజు, ఉపాధి కూలీలు ఉన్నారు.


కూలీలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం


చేపల చెరువును పరిశీలిస్తున్న విద్యార్థులు

## కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరం

పెబ్బేరు, మార్చి 20 : పెబ్బేరులోని మత్స్య కళాశాల ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా బుధవారం వీపనగండ్ల మండలం గోవర్ధనగిరి గ్రామాన్ని సందర్శించినట్లు ప్రోగ్రాం అధికారి దేవానంద్ తెలిపారు. ఏడురోజులపాటు సాగే ఈ శిబిరంలో మూడో రోజు గ్రామంలోని గణేశ్ అనే వ్యక్తి చేపల నర్సరీలో పలు అంశాలను క్షుణ్ణంగా పరిశీలించినట్లు ఆయన చెప్పారు. చేపలకు ఆహారాన్ని ఇవ్వడం, పంట కోత, ఆరోగ్యాన్ని పరీక్షించడం, నర్సరీ వల్ల ఖర్చు, లాభం వంటి విషయాలను విద్యార్థులు తెలుసుకున్నారన్నారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ నాగలక్ష్మి అధ్యక్షతన కార్యక్రమాలు జరిగినట్లు ఆయన వివరించారు.

# ఆస్తిపన్ను వడ్డీపై 90శాతం రాయితీ

- లబ్ధి పొందనున్న 3,062మంది
- ఈనెల చివరి వరకు అవకాశం

గద్వాల టౌన్, మార్చి 20 : మున్సిపాలిటీ ఆస్తిపన్ను వడ్డీపై రాయితీ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఈమేరకు గతవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పాత బకాయితో పాటు ప్రస్తుత పన్నును ఒకేసారి కడితే వడ్డీపై 90శాతం రాయితీ ఇస్తుంది. ఇందుకు 3,062మంది అర్హులుగా ఎంపికయ్యారు.

***3062మందికి లబ్ధి..***

90శాతం వడ్డీ రాయితీ పొందేందుకు గద్వాల మున్సిపాలిటీ పరిధిలో 3062మంది ఎంపికయ్యారు. వీరి నుంచి కోటీ 87లక్షల జరిమానా రూపంలో రావాల్సి ఉంది. కానీ ప్రభుత్వ రాయితీతో కేవలం రూ.18.79లక్షలు మాత్రమే మున్సిపాలిటీకి సమకూరే అవకాశం ఉంది.

***31వరకు గడువు..***

ఆస్తి పన్ను బకాయిలపై ప్రభుత్వం నిర్ణీత గడువు విధించింది. ఈనెల 31వరకు చెల్లించేందుకు అవకాశం కల్పించింది. ఈ లోపు చెల్లించిన వారికి మాత్రమే మాఫీ వర్తిస్తుంది. అలాగే ఇప్పటికే చెల్లించిన వారికి సర్దుబాటు ప్రయోజనాన్ని కూడా కల్పించారు. ఇందుకు గానూ అధికారులు ఇప్పటికే విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రత్యేక బ్యానర్లు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.



గద్వాల మున్సిపాలిటీ కార్యాలయం

### సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం ప్రకటించిన రాయితీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. 25రోజుల గడువు మాత్రమే ఉంది. ఆర్థిక బారాన్ని తగ్గించుకునేందుకు ఇది మంచి అవకాశం. ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. గడువు లోపు లక్ష్యాన్ని చేరుకుంటాం.

- శంకర్‌సింగ్, మున్సిపల్ కమిషనర్



## కోరం లేక మండల సభ వాయిదా

అలంపూర్, మార్చి 20: అలంపూర్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో జబ్బార్ పేర్కొన్నారు. మొదట 19వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించాలని అధికారులు నిర్ణయించగా.. ప్రజాప్రతినిధులు హాజరు కాకపోవడంతో బుధవారం నాటికి వాయిదా వేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రకటించారు. అయితే బుధవారం కూడా ఎంపీటీసీలు హాజరుకాకపోవడంతో చేసేదేమీ లేక అధికారులు వాయిదా వేశారు. ఎన్నడూ లేనివిధంగా అలంపూర్ మండలంలో రెండ్రోజులు వరుసగా నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయా శాఖల అధికారులు హాజరైనా, ప్రజాప్రతినిధులు హాజరు కాకపోవడంతో వాయిదాపడటం గమనార్హం.

## ప్రచారానికి అనుమతి తప్పనిసరి

ఆత్మకూరు, మార్చి 20: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళికి లోబడి ఎలాంటి ప్రచారం నిర్వహించినా తప్పనిసరి అనుమతి తీసుకోవాలని ఆత్మకూరు ఎస్సై వాకిటి నరేందర్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రచార అనుమతి కావాల్సిన వారు సువిధ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, బెదిరింపులకు పాల్పడడం, తప్పుడు ప్రచారాలు చేయడం, సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం చట్టరీత్యా నేరంగా పరిగణిస్తామన్నారు. ఇంటి యజమానుల అనుమతులు లేకుండా గోడలపై పోస్టర్లు అంటించడం, వాల్ రైటింగ్ లాంటివి చేయకూడదని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని చెప్పారు.

## రైతు సదస్సును జయప్రదం చేయాలి

అయిజ, మార్చి 20: సాగు భూముల రైతులకు


కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

పట్టాలు ఇవ్వాలని, రైతులకిచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, డబ్ల్యూటీవో నుంచి భారత్ బయటకు రావాలని కోరుతూ ఈ నెల 23న హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న రైతు సదస్సుకు రైతాంగం తరలిరావాలని తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్ కోరారు. బుధవారం పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో సదస్సు కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో విజయ్‌భాస్కర్‌రెడ్డి, రాములు, సుంకన్న, శ్రీనివాసులు, మధుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పాలిసెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి టౌన్, మార్చి 20 : పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ 2024-25 విద్యా సంవత్సరానికి గానూ వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ బుధవారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ప్రవేశ పరీక్ష మే 24వ తేదీన ఉంటుందని తెలిపారు. ఏప్రిల్ 22వరకు రూ.100 రుసుముతో , 26వ వరకు రూ.300 అసరాధ రుసుముతో పాలిసెట్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వనపర్తి పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్‌ర, సివిల్, మెకానికల్ ఇంజినీర్ కోర్సులు ఉన్నాయని పదో తరగతి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అదే విధంగా ఇంటర్ అర్హతతో డీఫార్మసీలో సీట్లు కూడా ఉన్నాయని చెప్పారు. ఒక్కో కోర్సులో 60సీట్ల చొప్పున ఖాళీలు ఉన్నాయని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ముమ్మరంగా ఆస్తిపన్ను వసూలు

అయిజ, మార్చి 20: మున్సిపాలిటీలో ఆస్తిపన్ను వసూలు ముమ్మరంగా చేపట్టారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ సత్యబాబు ఆదేశాల మేరకు మేనేజర్ రాజేశ్‌కుమార్, బిల్ కలెక్టర్లు పట్టణంలో పర్యటిస్తూ ఆస్తి పన్ను వసూలు చేశారు. బకాయిదారులు రాయితీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈనెల చివరిలోగా ప్రజలు ఆస్తిపన్ను చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ పట్టణ ప్రజలకు సూచిస్తున్నారు.

## జోరుగా ఉపాధి హామీ పనులు

ధరూరు, మార్చి 20 : గ్రామాల్లో ఉపాధి హామీ పనులు జోరందుకున్నాయి. చెరువులు, కాల్వలు, వ్యవసాయ పొలాలు, రోడ్లను శుభ్ర పర్చడం, గుంతల్లో మట్టిని నింపడం వంటి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. అలాగే వ్యవసాయ పొలాలు, చెరువులో కంప చెట్లు తొలగించడం వంటి పనులను చేస్తున్నారు.

## అయ్యప్ప దీక్షా ప్రచార సమితి కార్యవర్గం

పెబ్బేరు, మార్చి 20: పెబ్బేరులోని ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయంలో అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి మండల కమిటీ కార్యవర్గం బుధవారం ఏర్పాటైంది. గౌరవాధ్యక్షులుగా వేమారెడ్డి, శ్రీనివాసులు, గోవర్ధన్, అధ్యక్షుడిగా ప్రదీప్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా గోపాల్, మునీశ్వర్, సతీశ్, వెంకట్రాములుతో పాటు ఇతర కమిటీని ఎన్నుకున్నారు.